సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
శనివారం । 16 । డిసెంబర్ । 2023



వినియోగదారులకు నాణ్యమైన సేవలు - 8లో▸

సాంకేతికను అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తామని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు.



సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు సూచించారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $30^0/18^0$

జిల్లాలో ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

ప్రయాణికుల వివరాలు (పురుషులు / మహిళలు)

తేదీ	పురుషులు	మహిళలు	శాతం	మొత్తం
9వ తేదీ	2,19,971	94,344	30.01%	3,14,315
10వ తేదీ	1,49,741	2,30,215	60.58%	3,79,956
11వ తేదీ	1,67,412	2,59,933	60.82%	4,27,345
12వ తేదీ	1,37,458	2,46,298	64.18%	3,83,756
13వ తేదీ	1,50,718	2,72,938	64.42%	4,23,656
14వ తేదీ	1,37,182	2,76,091	66.80%	4,13,273



మహాలక్ష్మి భళా..

ఆర్టీసీకి పెరిగిన మహిళా ప్రయాణికులు
- 45 శాతం నుంచి 58 శాతానికి పెరుగుదల
- శుక్రవారం నుంచి జీరో టికెట్.. ప్రయాణానికి గుర్తింపుకార్డు తప్పనిసరి



మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ జారీ చేస్తున్న కండక్టర్

హన్మకొండ: మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే మహాలక్ష్మి పథకాన్ని ఈనెల 9న సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. సాఫ్ట్‌వేర్ అందుబాటులో లేకపోవడంతో ఇప్పటివరకు ఎలాంటి గుర్తింపు కార్డు అవసరం లేకుండానే ప్రయాణానికి అనుమతిచ్చారు. టికెట్ జారీకి సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రావడంతో కండక్టర్లు శుక్రవారం నుంచి జీరో టికెట్ జారీ చేస్తున్నారు. రాష్ట్ర మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈక్రమంలో స్థానికతను తెలుసుకునేందుకు ఏదేని గుర్తింపు కార్డు చూపించాలనే నిబంధన పెట్టింది. ఇప్పటి నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించడానికి వెంట ఆధార్ కార్డు లేదా ఏదేని ఇతర గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలి.

టిమ్‌లోని క్యాట్ కార్డ్ బటన్‌తో అనుసంధానం

టికెట్ ఇష్యూ మిషన్ (టిమ్)లో గతంలో క్యాట్ కార్డు చెలామణిలో ఉన్న సమయంలో వారికి టికెట్ జారీ కోసం ప్రత్యేక బటన్ ఉండేది. ఆ కార్డుల రద్దుతో అ బటన్ ఖాళీగా ఉంది. మహిళలకు ఉచిత ప్రయాణంతో క్యాట్‌కార్డు బటన్‌ను జీరో టికెట్‌కు అనుసంధానం చేస్తూ సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఈ బటన్ నొక్కగానే మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించిన పెద్దలు, పిల్లల ఆప్షన్ వస్తుంది. ఆ ఆప్షన్ ఎంచుకుని స్టేజీ నంబర్ నొక్కగానే టికెట్ బయటకు వస్తుంది. ఈ టికెట్‌పై ప్రయాణికుడు ప్రయాణించే దూరానికి నిర్దేశించిన చార్జీల మొత్తంతోపాటు జీరో టికెట్ వస్తుంది. దీంతో బస్సు వారీగా ఉచితంగా ఎంత మంది ప్రయాణించారు.. చార్జీ ఎంత మొత్తం అనే వివరాలు అదే రోజు తెలిసిపోతాయి.

వరంగల్ రీజియన్‌లో పెరిగిన ప్రయాణికులు

మహాలక్ష్మి పథకం ప్రారంభానికి ముందు రోజు వరకు వరంగల్ రీజియన్ పరిధిలో బస్సులో 45 శాతం మహిళా ప్రయాణికులుండేవారు. ఉచిత ప్రయాణంతో వీరి సంఖ్య 58.91 శాతానికి చేరింది. ఈ నెల 9 నుంచి 14 వరకు 23,42,301 మంది ప్రయాణించగా ఇందులో 13,79,819 మంది మహిళలు, 9,62,482 మంది పురుషులు ఉన్నారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి..



మహాలక్ష్మి పథకంతో బస్సులో ఉచిత ప్రయాణానికి గుర్తింపు కార్డు తప్పనిసరి. గుర్తింపు కార్డు చూపించకపోతే చార్జీతో కూడిన టికెట్ జారీ చేస్తారు. ఉచిత ప్రయాణంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చింది. జీరో టికెట్ జారీ చేస్తున్నాం.

- జాస్తి శ్రీలత, వరంగల్ ఆర్ఎం

న్యూస్‌రీల్

21న జిల్లా స్థాయి యువజన పోటీలు

హన్మకొండ: ఈనెల 21న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని హ్యాండ్ బాల్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి యువజన పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జానపద నృత్యాలు, జానపద గేయాలు, జీవన నైపుణ్యం అంశాల్లో కథా రచన, పోస్టర్ తయారీ, డిక్లమేషన్, ఫొటోగ్రఫీ అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు 15 నుంచి 29 సంవత్సరాల్లోపు వయస్సు కల్గిన వారు అర్హులుగా పేర్కొన్నారు. యువతలోని కళా నైపుణ్యాల్ని, సాహిత్య పాటవాలను వెలికి తీసి ప్రోత్సహించడం, సంస్కృతీ సంప్రదాయాలను, జానపదాల్ని పరిరక్షించే ప్రయత్నంలో భాగంగా ఏటా యువజన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన యువత రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే యువత రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, వయసు ధ్రువీకరణ పత్రం, ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డు జిరాక్సులు తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 99896 03085, 94903 92355 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు డ్రాయింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీలో లోయర్ అండ్ హయ్యర్ గ్రేడ్లలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షకు ఈనెల 29 వరకు అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యా శాఖ అధికారి ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. ఈపరీక్షలకు హాజరవ్వాలనుకునే అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ బీఎస్‌ఈ.తెలంగాణ.గౌట్.ఇన్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ సూచించారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా రాధిక గుప్తా



హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా రాధిక గుప్తాను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు రెండు అదనపు కలెక్టర్ పోస్టులు ఉండగా.. హనుమకొండ జిల్లాకు మాత్రం ఇప్పటి వరకు ఒకే పోస్ట్ భర్తీ చేశారు. తాజాగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పోస్టును భర్తీ చేస్తూ ప్రభుత్వం కేటాయించడంతో రెండు పోస్టులు భర్తీ అయ్యాయి.

తెరుచుకున్న టేకులగూడెం బడి

సాక్షి ఎఫెక్ట్

విద్యారణ్యపురి: 'సర్దుబాటుతో తడబడి' శీర్షికన ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మూతబడిన పాఠశాలను తెరిపించారు. కాజీపేట మండలం టేకులగూడెం ప్రాథమికోన్నత పాఠశాల (యూపీఎస్)ను శుక్రవారం ఉపాధ్యాయులు తెరిచారు. మడికొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులను ఆహైస్కూల్ నుంచి రిలీవ్ చేసి టేకులగూడెం యూపీఎస్‌కు వెళ్లాలని, పాఠశాలను తెరవాలని ఎంఈఓ రాంకిషన్ రాజు ఆదేశించారు. దీంతో శుక్రవారం ఆ ముగ్గురు ఉపాధ్యాయులు, ఒక సీఆర్పీ వెళ్లి యూపీఎస్‌ను తెరిచారు. ఉపాధ్యాయులు గ్రామంలోని ఇంటింటికీ తిరిగి విద్యార్థులున్నారా? వేరే పాఠశాలలకు వెళ్తున్నారా? అనేది ఆరా తీశారు. తల్లిదండ్రులను ఒప్పించి తిరిగి అదే పాఠశాలలో పిల్లలను చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తారని ఎంఈఓ తెలిపారు.

చలికి.. విల విల

సంక్షేమ వసతి గృహాల్లో వణుకుతున్న విద్యార్థులు
- పూర్తిస్థాయిలో అందని రగ్గులు
- బెడ్‌షీట్లతో సర్దుకుంటూ ఆపసోపాలు
- ఇంటినుంచి తెచ్చుకుని కప్పుకుంటున్న వైనం

సాక్షి విజిట్

కాజీపేట అర్బన్: వసతి గృహాల్లోని విద్యార్థులు చలికి గజగజా వణుకుతున్నారు. ప్రభుత్వం రగ్గులు అందించకపోవడంతో చలిని తట్టుకోలేకపోతున్నారు. చలికి నిద్రపట్టడం లేదని, ప్రభుత్వం రగ్గులు అందించలేదని గురువారం రాత్రి 'సాక్షి' నిర్వహించిన హాస్టల్స్ విజిట్‌లో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

చలిపంజా..

విద్య, వైద్యం ప్రతి ఒక్కరికీ సమానంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు, ప్రజాప్రతినిధులు తరచూ చెబుతుంటారు. కానీ.. క్షేత్ర స్థాయిలో అది అమలవడం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేద విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల్లో, హాస్టళ్లలో చేరలేని దుస్థితిలో ప్రభుత్వ హాస్టళ్లలో చేరుతున్నారు. కాగా.. ప్రతీ ఏడాది ప్రతీ విద్యార్థికి యూనిఫాం, బుక్స్‌తో పాటు కాలానుగుణంగా బెడ్ షీట్లు, రగ్గులు అందించాలి. ఇటీవల వాతావరణంలో చోటు చేసుకున్న పెనుమార్పులతో సాధారణ చలికాలం కంటే ఎక్కువగా చలిపులి తన పంజా విసురుతోంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం నుంచి రగ్గులు అందక విద్యార్థులు నిద్ర సరిగ్గా పోవడం లేదు. పల్చటి బెడ్ షీట్లు, ఇంటి నుంచి తెచ్చుకున్న బొంతల్లో తలదాచుకుంటూ వణుకుతూ గడుపుతున్నారు. సకాలంలో రగ్గులు అందించకపోవడంతో విద్యార్థులు జలుబు, జ్వరాల బారిన పడుతున్నారు.

హనుమకొండ జిల్లాలో.. హాస్టళ్లు, విద్యార్థుల వివరాలు

ఎస్టీ హాస్టల్స్.. ప్రీ మెట్రిక్	
బాలికలు హాస్టల్–1	
బాలురు హాస్టళ్లు–6	
మొత్తం బాలికలు	366
బాలురు	633
ఎస్సీ హాస్టల్స్.. ప్రీమెట్రిక్	
బాలికల హాస్టల్ –5	
బాలుర హాస్టల్–10	
మొత్తం బాలికలు	176
బాలురు	375
బీసీ హాస్టల్స్.. ప్రీ మెట్రిక్	
బాలికల హాస్టల్–3	
బాలుర హాస్టల్–7	
మొత్తం బాలురు	493
బాలికలు	177

మరికొన్నింటిలో..

- హనుమకొండ బాల సముద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్. ఇక్కడ 34 మంది వసతి పొందుతున్నారు. గతంలో చలికాలంలో రగ్గులు ఇచ్చారు. రెండేళ్ల క్రితం ఇచ్చిన రగ్గులు చిరిగిపోయాయి. గతేడాది నుంచి రగ్గులు లేక చలికాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలిలో వణుకుతూ నిద్రిస్తున్నారు. ఓపక్క రగ్గులే లేవంటే ఇనుప మంచాలపై పరుపులు కూడా లేవు. దీంతో మంచంపై పడుకోలేక, నేలపై పడుకోలేక చలికి వణుకుతూ గడుపుతున్నారు. చలికారణంగా 34 మందిలో సుమారు 20 మందికిపైగా జలుబుతో బాధపడుతున్నారు. బెడ్‌పై కప్పుకునేందుకు ఇచ్చిన బెడ్‌షీట్స్‌తో చలి ఆగట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- నగరంలోని శివనగర్ ఎస్సీ బాలుర హాస్టల్‌లో రెండు రోజులక్రితమే స్వెట్టర్లు పంపిణీ చేసినట్లు తెలిసింది. ఆగస్టులో దుప్పట్లు పంపిణీ చేశారని విద్యార్థులు తెలిపారు. హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని విద్యార్థులు కోరారు.



వరంగల్: కిటికీలకు అడ్డుగా పెట్టిన విద్యార్థుల దుప్పట్లు



వరంగల్: హాస్టల్ వెనుకవైపు పడిపోయిన ప్రహరీ

వరంగల్: నగరంలోని రంగంపేట గిరిజన బాలుర వసతి గృహంలోని విద్యార్థులు చలితో ఇబ్బందులు పడుతున్నారు. రూముల్లోని కిటికీలకు తలుపుల్లేక దుప్పట్లు అడ్డుగా పెడుతున్నారు. గత సంవత్సరం బెడ్‌షీట్లు పంపిణీ చేసిన అధికారులు.. ప్రస్తుతం ఈఏడాది ఇంకా పంపిణీ చేయలేదు. వసతి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో 200 మందికి పైగా.. ఉండాల్సిన విద్యార్థులు కేవలం 30 మందే ఉంటున్నారు. గతేడాది పంపిణీ చేసిన దుప్పట్లు కొన్ని మిగలడంతో వార్డెన్ చిన్న పిల్లలకు పంపిణీ చేయగా.. ఉన్నత తరగతుల పిల్లలకు ఇవ్వకపోవడంతో ఇంటినుంచి తెచ్చుకుని కప్పుకుంటున్నారు. వసతి గృహానికి వెనుకవైపు ఉన్న ప్రహరీ పడిపోవడంతో కుక్కలు, పందులు వస్తున్నాయి.

ఈ వసతి గృహంలో విధులు నిర్వర్తించే వార్డెన్ మధ్యాహ్నం వరకే ఉండిపోతుండడంతో రాత్రి వేళల్లో విద్యార్థులు భయాందోళనలతో గడుపుతున్నారు. కాగా.. సాక్షి విజిట్ చేసిన సమయంలో హాస్టల్‌లో నైట్ వాచ్‌మెన్ కూడా లేకపోవడం వల్ల విద్యార్థుల భద్రత గాలికి వదిలేసినట్లుగా కనిపించింది.

చాలీచాలని చెద్దర్లు



వరంగల్ చౌరస్తా: వరంగల్ యాకుబ్‌పురాలోని గిరిజన బాలుర సంక్షేమ హాస్టల్ వసతి గృహంలో కొంత మంది విద్యార్థులు చాలీచాలనీ చెద్దర్లతో వణుకుతున్నారు. ఐదోతరగతి నుంచి ఇంటర్ రెండో సంవత్సరం వరకు తరగతుల బోధన, హాస్టల్ వసతి ఉంది. మొత్తం 540 మంది విద్యార్థులున్నారు. వీరిలో ఆరో తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు ఒక బ్లాంకెట్, ఒక చెద్దర్ అందించారు. కానీ.. ఈ ఏడాది 5వ తరగతిలో చేరిన విద్యార్థులకు కేవలం ఉలన్ మ్యాట్‌లు అందించారని, చెద్దర్లు ఇవ్వలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇది హనుమకొండలోని ఎస్సీ బాలుర హాస్టల్. తల్లిదండ్రులు లేని అనాథలకు ఆనంద నిలయంలో 13 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరికి రెండేళ్ల క్రితం ఇచ్చిన రగ్గులు పూర్తిగా చిరిగిపోయాయి. విద్యార్థులు ఇనుప మంచాలపై బెడ్‌షీట్స్ వేసుకుని పడుకుంటున్నారు. చలికి గజగజా వణుకుతున్నారు.

ఇప్పటికీ రగ్గులివ్వలేదు..



మా హాస్టల్‌లో ఇప్పటి వరకు రగ్గులు అందించలేదు. దీంతో చలిలో వణుకుతూ పడుకుంటున్నాం. మాకు స్వెటర్స్ కూడా లేకపోవడంతో చలిలో పడుకోవడం ఇబ్బందిగా ఉంది. రాత్రి సరిగ్గా నిద్రపోలేక స్కూలుకు వెళ్లాక నిద్ర వస్తోంది. చదువు మీద ధ్యాస పెట్టలేకపోతున్నాం.

- విఘ్నేష్, పదో తరగతి, ఎస్సీ హాస్టల్, హనుమకొండ

రగ్గులు, బెడ్లు లేవు



మా ఎస్సీ హాస్టల్‌లో మాకు ఇనుప మంచాలు పడుకునేందుకు ఇచ్చారు. కానీ మంచంపై పరుపులు చిరిగిపోవడంతో తీసేశాం. దీంతో ఇనుప మంచంలో పడుకోలేకపోతున్నాం. నేలపైన పడుకున్నా.. ఇనుప మంచంపై పడుకున్నా కూడా చలిలో వణికిపోతున్నాం. మాకు దూది బెడ్స్, రగ్గులు అందజేయాలి.

- మహేశ్‌బాబు, 9వ తరగతి , హనుమకొండ

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగులకు బహుమతులు అందిస్తున్న హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ.. విభిన్న రంగాల్లో రాణించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఇటీవలి క్రీడా పోటీల విజేతలకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ బహుమతులు, ప్రశంసపత్రాలు ప్రదానం చేశారు. దివ్యాంగ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ అనిత రెడ్డి పాల్గొన్నారు.

అమ్మాయిలపై వివక్ష తగదు..

హన్మకొండ అర్బన్: అమ్మాయిలపై వివక్ష తగదని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం అమలులో భాగంగా జిల్లా అప్రాప్రియేట్ అథార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలో చట్టం అమలు తీరు, చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, పీహెచ్‌సీల వారీగా అమ్మాయిల జననాలను కలెక్టర్ సమీక్షించారు. లింగ వివక్ష చట్టంపై పోస్టర్ ఆవిష్కరించారు.

పకడ్బందీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా..

హన్మకొండ అర్బన్: భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ముసాయిదా షెడ్యూల్ విడుదల చేసినట్లు, ఈమేరకు డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్పెషల్ సమ్మరీ రివిజన్, ఓటరు నమోదుపై పరకాల నియోజకవర్గ పరిధి మండలాల తహసీల్దార్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

మెరుగైన విద్యనందించాలి..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యనందించి వారి భవిష్యత్‌కు నాంది పలకాలని స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ వాకాటి కరుణ, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీదేవసేన కలెక్టర్లు, డీఈఓలకు సూచించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అధికారులతో వారు సమీక్షించారు.

సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు పెద్దపీట
వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు పెద్దపీట వేయనున్నట్లు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌లో కూడా దివ్యాంగుల నుంచి ప్రత్యేకంగా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ప్రతి నెల మూడో శనివారం దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ కూడా ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎంజీఎం ఆస్పత్రిలో కూడా దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఓపీ కౌంటర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మల్లికాంబ మనో వికాస కేంద్రం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. జిల్లా శిశు సంక్షేమ అధికారి శారద, డీఆర్డీఓ సంపత్‌రావు, సీనియర్ అసిస్టెంట్ అరుణాదేవి, కమిటీ సభ్యులు చక్రపాణి, నర్సక్క పాల్గొన్నారు.

దేశ ప్రగతికి పరిశోధనల తోడ్పాటు

- ఏఆర్‌సీఐ డైరెక్టర్ నర్సింగరావు
- అట్టహాసంగా రేడియో–23 ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ఏఆర్‌సీఐ డైరెక్టర్ నర్సింగరావు

కాజీపేట అర్బన్: దేశ ప్రగతికి నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు తోడ్పడతాయని ఏఆర్‌సీఐ, హైదరాబాద్, డైరెక్టర్ డాక్టర్ నర్సింగరావు అన్నారు. నిట్ వరంగల్ అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో శుక్రవారం రెండ్రోజుల రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఇండస్ట్రియల్ అవుట్ రీచ్–23 (రేడియో–23) సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఆర్‌సీఐ డైరెక్టర్ నర్సింగరావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న 31 ఎన్ఐటీలను ఒకే తాటిపైకి తీసుకొచ్చి పరిశ్రమలకు అనుగుణంగా పరిశోధనలు చేపట్టేందుకు వేదికగా సదస్సును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ మాట్లాడుతూ.. ప్రభుత్వ సమస్యలు, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ స్టార్టప్‌ల ఏర్పాటుకు రేడియో–23 సదస్సులో చర్చించేందుకు దేశవ్యాప్త ఎన్ఐటీలను సమన్వయ పర్చడంలో నిట్ వరంగల్ వేదికగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సోమశేఖర్, దేశవ్యాప్త నిట్‌లోని 21 మంది డీన్‌లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బయోమైనింగ్ పూర్తి చేయండి

వరంగల్ అర్బన్: బయోమైనింగ్ ప్రక్రియను జనవరి చివరి వరకు పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా పరిధి 46వ డివిజన్ రాంపూర్ డంపింగ్ యార్డులో బయో మైనింగ్ ప్రక్రియ ద్వారా కొనసాగుతున్న పని తీరును ఆయన పరిశీలించారు. ఆయన వెంట సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేశ్, ఈఈ సంజయ్‌కుమార్, డీఈ సంతోశ్ బాబు, ఏఈలు వెంకటేశ్వర్లు, సంతోశ్, సైట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ ఆగ్రహం

ఆస్తి, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లపై అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజు వారీ లక్ష్యాల్లో చిత్తశుద్ధి లోపించిందని, పనితీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. శుక్రవారం హంటర్ రోడ్డులోని ఓ మార్ట్ ఏరియాలో, నక్కలగుట్టలో పలు ప్రాంతాల్లో ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు పన్నుల వసూళ్లపై ఆకస్మికంగా తనిఖీ చేసి వసూళ్ల వివరాలు తెలుసుకున్నారు.

సమన్వయం అవసరం

నయీంనగర్: వివిధ విభాగాల (డిపార్ట్‌మెంట్) మధ్య సమన్వయం అవసరమని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా అన్నారు. శుక్రవారం 'కుడా' కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, శానిటేషన్ అండ్ హెల్త్ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సిటీ ప్లానర్ వెంకన్న, హనుమకొండ ఆర్డీఓ రమేశ్, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఏసీపీలు ఖలీల్, శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజీపడే కేసులు పరిష్కరించుకోవాలి

- 30న జాతీయ లోక్ అదాలత్
- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి



మాట్లాడుతున్న వరంగల్ జిల్లా జడ్జి కె.రాధాదేవి

వరంగల్ లీగల్ : రాజీపడే కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కని వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి కక్షిదారులకు సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్వర్యంలో ఈనెల 30న శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, వివిధ మోటారు ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి కె.రాధాదేవి మాట్లాడుతూ.. కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేలా న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. ఇప్పటికే వివిధ కేసుల్లో నోటీసులు అందించామని, నోటీసులు అందని, రాజీపడే కక్షిదారులు జిల్లా న్యాయవాసేవాధికార సంస్థను సంప్రదించి రాజీ కుదుర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, న్యాయవాదుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వై.శ్యాంసుందర్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

30న జాతీయ లోక్ అదాలత్ :అపర్ణాదేవి

జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈనెల 30న జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి బి.అపర్ణాదేవి తెలిపారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో హనుమకొండ జిల్లా న్యాయవాదులు, పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, మోటార్ ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అపర్ణాదేవి మాట్లాడుతూ లోక్ ఆదాలత్‌లో రాజీపడదగు కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె.ఉపేందర్‌రావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్యాంసుందర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ యం.సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యతోనే ముందడుగు

● మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నరహరి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నరహరి

హన్మకొండ: విద్యతోనే సమాజం ముందడుగు వేస్తుందని మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి అన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ, సైకాలజిస్టుల సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల ఫలితాలు పెంచడానికి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న మూడు నెలల ప్రేరణ కార్యక్రమాన్ని శుక్రవారం హనుమకొండలోని ఆదర్శకాలనీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యార్థులు ఇలాంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమ రూపకర్త, సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల ఫలితాలు పెంపొందించేందుకు ఉచితంగా ప్రేరణ సదస్సులు నిర్వహిస్తున్నామని వివరించారు. వివరాలకు 9989310141 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పరికిపండ్ల వేణు, సూర్య కిరణ్, పాగాల రాజయ్య, ఆడెపు రామకృష్ణ, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఆడ సుధాకర్, రామ్, లక్ష్మణ్, తేరాల యుగంధర్, బేతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

17న కేయూ రిటైర్డ్ అధ్యాపకుల సమావేశం



కేయూ క్యాంపస్: పెన్షనర్స్ డే సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ అధ్యాపకుల సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 17న యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నట్లు కేయూ రిటైర్డ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ సదానందం, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ అధ్యాపకుల సమస్యలపై చర్చించడంతో పాటు విశ్వవిద్యాలయ పూర్వవైభవం, అభివృద్ధి - ప్రస్తుత కర్తవ్యాలు గురించి అవలోకనం చేసుకునేందుకు పెన్షనర్స్ డేను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు

● టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న వరుణ్ రెడ్డి

హన్మకొండ: ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుంటూ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తానని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధి ప్రధానంగా వ్యవసాయ ప్రాంతమని, రైతులకు నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్ అందించాలని సూచించారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన సీఎండీ వరుణ్ రెడ్డికి డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్ రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతి రెడ్డి, తాజా మాజీ సీఎండీ అన్నమనేని గోపాల్ రావు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛం, మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

భద్రకాళి ఆలయంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ పూజలు

హన్మకొండ కల్చరల్ : చారిత్రక భద్రకాళి ఆలయాన్ని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డికి ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి, అర్చకుడు భద్రకాళి శేషు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వరుణ్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కాగా, అర్చకులు అరుణ్‌రెడ్డికి అమ్మవారి శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. ఈఓ శేషుభారతి అమ్మవారి చిత్రపటం బహూకరించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈఈ, ఏఈఈలు, తదితరులు పాల్గొన్నారు.



సీఎండీ వరుణ్‌రెడ్డికి అమ్మవారి చిత్రపటం బహూకరిస్తున్న ఈఓ

సీపీని కలిసిన ఎన్పీడీసీఎల్ సీఎండీ..

వరంగల్ క్రైం : టీఎస్ ఎన్పీడీసీఎల్ నూతన చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వరుణ్‌రెడ్డి శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. అనంతరం ఇరువురు అధికారులు పలు అంశాలపై చర్చించుకున్నారు.



సీపీకి పూలమొక్క అందజేస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

విద్యతోనే సామాజిక ప్రగతి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

హాజరైన విద్యార్థులు, పరిశోధకులు, బోధన, బోధనేతర సిబ్బంది

● మానవ హక్కుల కార్యకర్త చంద్రశేఖర్
● బాలగోపాల్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి: జి హరగోపాల్

కేయూ క్యాంపస్: విద్యతోనే సామాజిక ప్రగతి సాధ్యమని మానవ హక్కుల కార్యకర్త, ఏపీలోని అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు ఎ.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో వీసీ తాటికొండ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన మానవహక్కుల నేత దివంగత డాక్టర్ కే బాలగోపాల్ 13వ స్మారక ఉపన్యాస కార్యక్రమంలో 'మానవ హక్కులు - ప్రజాస్వామ్యం' అనే అంశంపై చంద్రశేఖర్ స్మారకోపన్యాసం చేశారు. ప్రజాస్వామ్యం.. జీవన విధానం అన్నారు. ఆదివాసీల ఉనికి కనుమరుగవుతుందన్నారు. ఆదివాసీలు ప్రజాస్వామ్యంలో అంతర్భమన్నారు. అటవీ సంరక్షణ సవరణ చట్టం -2023 సంరక్షణ చట్టం కాదన్నారు. దీంతో ఆదివాసీల హక్కులకు కూడా భంగం కలిగే అవకాశం ఉందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం- 2020లో చాలా లోపాలు ఉన్నాయన్నారు. మార్కుల ఆధారంగా విద్యార్థులు గ్రేడింగ్ సరికాదన్నారు. ప్రముఖ సామాజికవేత్త, సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యుడు జి హరగోపాల్ మాట్లాడుతూ పర్స్పెక్టివ్ సంస్థలో బాలగోపాల్ కూడా సభ్యుడిగా ఉండేవారన్నారు. ఈ సంస్థ తరపున సామాజికపరమైన చాలా పుస్తకాలను ప్రచురించామన్నారు. బాలగోపాల్ పుస్తకాలు బహుళ జనాదరణ పొందాయన్నారు. నేటి విద్యార్థుల్లో పుస్తకపఠనం తగ్గిందని, పుస్తకాలు చదవడం జీవితంలో భాగం కావాలన్నారు. బాలగోపాల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. న్యాక్ మాజీ డైరెక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బాలగోపాల్ నోబెల్ మాన్ అన్నారు. గొప్ప సామాజిక, శాస్త్రీయ విశ్లేషకుడు బాలగోపాల్ అసాధారణ వ్యక్తి అన్నారు. వీసీ రమేష్ మాట్లాడుతూ గొప్ప మానవతా వాది బాలగోపాల్ అన్నారు. నేటి విద్యార్థులు ఆయన చరిత్ర తెలుసుకోవడం అవసరం ఉందన్నారు. అనంతరం బాలగోపాల్ సంక్షిప్త జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, బాలగోపాల్ సతీమణి డాక్టర్ వసంత లక్ష్మితో పాటు, జి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దొరికిన కిరాతకులు..

● రాకేశ్‌పై దాడి ఘటనలో ముగ్గురి అరెస్టు, రిమాండ్
● వివరాలు వెల్లడించిన ఏసీపీ బోనాల కిషన్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ బోనాల కిషన్

రామన్నపేట : వరంగల్ బస్టాండ్ ప్రాంతంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం ఎదుట రాకేశ్‌పై దాడి చేసి అతడి మృతికి కారణమైన ముగ్గురి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఘటనకు సంబంధించిన వివరాలు తెలిపారు. కాశిబుగ్గ శాంతినగర్‌కు చెందిన రాకేశ్(23) వంటపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 5వ తేదీన పర్లపల్లి విజయ అనే మహిళతో కలిసి చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీస్ ముందు నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కొందరు దుండగులు మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించగా వారితో రాకేశ్ వాగ్వాదానికి దిగాడు. దీంతో వారు రాకేశ్‌పై రాళ్లతో దాడి చేసి పారిపోయారు. ఈఘటనలో రాకేశ్‌కు తీవ్రగాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే విజయ అక్కడ ఉన్న స్థానికుల సాయంతో 108లో రాకేశ్‌ను ఎంజీఎం ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతున్న రాకేశ్ ఈ నెల 12వ తేదీన రాత్రి మృతి చెందాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా నేరస్తుల గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ దాడి ఘటనలో గరీబ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీధర్, సదువుల బన్ని, ఇస్లావత్ ప్రవీణ్ పాల్గొన్నట్లు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ ముష్కే శ్రీనివాస్, ఎస్సై కొమురెల్లి, క్రైం విభాగం సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

గోదావరిలో యువకుడి గల్లంతు

● కమలాపురంలో ఘటన



రాము (ఫైల్)

మంగపేట: ఓ యువకుడు గోదావరిలో స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని కమలాపురం జీపీ పరిధిలోని గోదావరి ఒడ్డు ప్రాంతంలో జరిగింది. గోదావరి ఒడ్డు ప్రాంతానికి చెందిన వృద్ధుడు కొత్తపల్లి చినబాబు మృతి చెందాడు. ఇదే కాలనీకి చెందిన రాంశెట్టి రాము (22).. చినబాబు అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. అంత్యక్రియల అనంతరం సమీపంలోని గోదావరిలో స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలోనే గల్లంతయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు కూడా రాము ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రెండు ఘటనలతో కాలనీలో విషాదం అలముకుంది.

చెరువు భూములు కబ్జా చేస్తే చర్యలు

● నీటిపారుదల శాఖ డీఈఈ రాజు
● బంధం చెరువులో రోడ్డు తొలగింపు
● 'సాక్షి' కథనాలకు స్పందన

సాక్షి స్పందన

హసన్‌పర్తి: చెరువు భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నీటిపారుదలశాఖ డీఈఈ రాజు హెచ్చరించారు. హసన్‌పర్తి మండలం దేవన్నపేటలోని బంధం చెరువును ఆక్రమించి నిర్మించిన రోడ్డును సంబంధిత అధికారులు శుక్రవారం తొలగించారు. నీటిపారుదలశాఖ డీఈఈ రాజు,ఏఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. బంధం చెరువు కబ్జాపై 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. ఇందుకు అధికారులు స్పందించారు. అంతకు ముందు రోడ్డు నిర్మాణం చేపట్టిన వారి గురించి అధికారులు ఆరా దీశారు. రాత్రి వేళల్లో బడా నాయకుల అండతో కొందరు వ్యక్తులు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా డీఈఈ రాజు మాట్లాడుతూ బంధం చెరువు కబ్జాపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.



రోడ్డును తొలగిస్తున్న అధికారులు

దూసుకొచ్చిన మృత్యువు..

● మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకునే లోపే అనంతలోకాలకు..
● ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
● ఆటో డ్రైవర్ దుర్మరణం
● మానునూరు శివారులో ఘటన



అనిల్ గౌడ్ (ఫైల్)

మామునూరు: బస్సు డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఓ ఆటో డ్రైవర్ కుటుంబంలో విషాదం నింపింది. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుతాడనుకునే సమయాన మృత్యువు బస్సు రూపంలో వచ్చి ఆటోను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం ప్రకారం హనుమకొండ జిల్లా పంథిని గ్రామానికి చెందిన బండి ఎల్లయ్య, విజయ దంపతుల కుమారుడు అనిల్ గౌడ్ (37) గీత వృత్తి చేస్తూ ఖాళీ సమయంలో ఆటో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. కొద్ది రోజుల నుంచి రంగశాయిపేట ప్రాంతంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. రోజు ఉదయం ఆటోలో పంథినికి వెళ్లి కల్లు విక్రయించి తిరిగి అదే ఆటోలో రంగశాయిపేటకు చేరుకుంటాడు. రోజు వారిగానే శుక్రవారం మధ్యాహ్నం కూడా ఆటోలో పంథిని చేరుకున్నాడు. కల్లు విక్రయించి సాయంత్రం రంగశాయిపేటకు బయల్దేరాడు. ఈ క్రమంలో వరంగల్-ఖమ్మం హైవేపై మామునూరు శివారులో వరంగల్ నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ఎదురు వస్తున్న ఆటోను ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్ అనిల్ రోడ్డుపై ఎగిరిపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందజేయగా సీఐ క్రాంతికుమార్, ఎస్సై కృష్ణవేణి హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదాలకు గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. కాగా, మరో పది నిమిషాల్లో వస్తానని చెప్పిన అనిల్.. మృతి చెందాడని తెలిసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. దీంతో పంథినిలో విషాదం నెలకొంది.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

● పీవీఎన్ఆర్ పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు మహేందర్
● మామునూరు కేవీకేలో కిసాన్ మేళా



మాట్లాడుతున్న డాక్టర్ మహేందర్

కరీమాబాద్: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ మహేందర్ అన్నారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం కిసాన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న అధ్యక్షత వహించగా డాక్టర్ మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పత్తిలో గులాబీ రంగు పురుగును నివారిస్తే అధిక దిగుబడి సాధించడమే కాకుండా కూలీల ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. వ్యవసాయంతోపాటు అనుసంధాన పంటల సాగు కూడా రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, డీఏఓ రవీందర్‌సింగ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ సారంగపాణి, కేవీకే శాస్త్రవేత్తలు అరుణజ్యోతి, సౌమ్య, రాజు, శశాంక్, సాయికిరణ్, వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు పొందారు'

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు సీనియర్ ప్రొఫెసర్లుగా గతంలో నియమ నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు పొందారని, యూనివర్సిటీ అధ్యాపకుల సమస్యలపై ప్రశ్నించినందుకు అకుట్ అధ్యక్షుడి, జనరల్ సెక్రటరీ పదోన్నతులు నిలిపివేశారని అకుట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి శుక్రవారం ఆరోపించారు. గతేడాది డిసెంబర్ 19, 20వ తేదీల్లో పదోన్నతుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించి, కొంతమంది అధ్యాపకులకు పదోన్నతులు కల్పించారని తెలిపారు. అకుట్ అధ్యక్షుడు తౌటం శ్రీనివాస్‌కు సీనియర్ ప్రొఫెసర్‌గా, తనకు ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించలేదని ఇస్తారి తెలిపారు. వీసీ, రిజిస్ట్రార్‌గా పదవిలో ఉండి నిబంధనలకు విరుద్ధంగా వారివురు మాత్రం సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందారని పేర్కొన్నారు. కాగా, జువాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉన్న మామిడాల ఇస్తారి.. తనకు ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించనందుకు ఈఏడాది మార్చి 20న హైకోర్టును ఆశ్రయించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కొడకండ్ల: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని పాకాలలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం పాకాల గ్రామానికి చెందిన కడిపికొండ సోమిరెడ్డి(75) ద్విచక్ర వాహనంపై కొడకండ్ల నుంచి పాకాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పాకాల క్రాస్ వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న స్తంభాన్ని ఢీకొంది. దీంతో సోమిరెడ్డికి తీవ్ర గాయాలుకావడంతో వెంటనే 108లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

కమలాపురంలో చోరీ.. నిందితుడి అరెస్టు

● రూ. 1.19 లక్షలు, సెల్ ఫోన్ స్వాధీనం



చోరీ వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై రవికుమార్

మంగపేట: మండలంలోని కమలాపురంలో కొద్ది రోజుల క్రితం చోరీకి పాల్పడిన తాడ్వాయి మండలం వీరాపురానికి చెందిన చేల సందీప్‌ను అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ. 1.19 లక్షల నగదు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం ఈనెల 1వ తేదీన కమలాపురంలో జరిగిన చోరీ కేసుపై దర్యాప్తు చేస్తున్న క్రమంలో గురువారం మండల కేంద్రంలో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని విచారించారు. ఇందులో గతంలో పలు చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చిన సందీప్ అని తెలింది. దీంతో అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ. 1.19 లక్షల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని ములుగు కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

ఆదివాసీ హక్కులను రక్షించుకోవాలి

● తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్



ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ ఇదే..

విద్యారణ్యపురి: ఆదివాసీ హక్కులు, చట్టాలను రక్షించుకోవాలని, అందుకు పోరాడాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కేయూ సమీపంలోని ఓ హాల్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదివాసీ హక్కుల చట్టాలు, ఆదివాసీల స్వయం పాలన, ఐదో షెడ్యూల్ అమలు, రిజర్వేషన్‌లో లంబాడీలతో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ ఎన్నిక..

ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్(ములుగు), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గొడం గణేష్ (ఆదిలాబాద్), ప్రధాన కార్యదర్శిగా గుర్రాల రవీందర్ (కరీంనగర్), ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ(ములుగు), ముక్తిరాజు (భద్రాద్రి కొత్తగూడెం), కె తిరుపతి (మంచిర్యాల), ఊకె సంజీవ్ (ఆదిలాబాద్), అట్టం సుభద్ర, ఊకే సుదర్శన్, తాటిరామరావు(ఖమ్మం) సహాయ కార్యదర్శులుగా అలం కిశోర్, సోయం జంగు (మంచిర్యాల), సోయం విక్రమ్ (జగిత్యాల), గోడం రేణు, శ్యాంరావు,(ఆదిలాబాద్), రేగ గణేష్ (భూపాలపల్లి), ప్రచార కార్యదర్శిగా కొడవ నగేష్, కోశాధికారిగా అడజంగు, సాంస్కృతిక కార్యదర్శిగా ఆగబోయిన రవి (మహబూబాబాద్), ప్రధాన సలహాదారులుగా సిద్దబోయిన లక్ష్మీనారాయణ (మహబూబాబాద్), కుర్సెంగు సూర్యభాను (ఆదిలాబాద్) ఎన్నికయ్యారు.

వైద్యులు బాధ్యతాయుతంగా ఉండాలి

● ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కాళీ ప్రసాద్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కాళీ ప్రసాద్

ఎంజీఎం : సమాజంలో ఏ వృత్తికి లేని విలువ వైద్యానికి ఉంటుందని, అందుకే వైద్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కాళీప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి వరంగల్ ఐఎంఏ హాల్‌లో 2023- 24 నూతన కార్యవర్గ ప్రమాణాస్వీకార మహోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడిగా మహ్మద్ అన్వర్ మియా, ఉపాధ్యక్షులుగా అజిత్ మహ్మద్, కొలిపాక వెంకటస్వామి, బుర్రి సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శిగా బింగి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా నరేశ్‌కుమార్, రామృష్ణ, అడబోయిన అనిత, కోశాధికారిగా శ్రవణ్‌కుమార్ ప్రమాణాస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కాళీప్రసాద్ మాట్లాడుతూ నూతన కమిటీ వైద్యుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆస్పత్రులు, వైద్యులపై జరుగుతు న్న దాడులను నివారించడానికి ఎథికల్ కమిటీని మరింత పటిష్టంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జాతీ య అధ్యక్షుడు డాక్టర్ రవీందర్‌రెడ్డి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఎథికల్ కమిటీ చైర్మన్ డాక్టర్ శేషుమాధవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్యారాణి, ఐఎంఏ హెల్త్ స్కీమ్ చైర్మన్ డాక్టర్ బందెల మోహన్‌రావు, కెఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, హన్మకొండ, వరంగల్ డీ ఎంహెచ్ఓలు సాంబశివరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణ హత్య

● కాజీపేట రహమత్ నగర్‌లో ఘటన



విజయ (ఫైల్)

కాజీపేట : ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురయ్యారు. దుండగులు అతి కిరాతకంగా కొట్టి చంపారు. ఈ ఘటన కాజీపేట పట్టణం 62వ డివిజన్ రహమత్ నగర్‌లో కలకలం రేపింది. కాలనీలో నివాసం ఉండే కోన విజయ (68) గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి చేరుకోలేదు. ఆందోళనకు గురైన కుటుంబీకులు స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విజయ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారు జామున కుక్కలు అరుస్తుండడంతో కుటుంబీకులు బయటకు రాగా ఇంటి పక్క గల్లీలో విజయ విగత జీవిగా పడి ఉంది. శరీరంపై దుస్తులు సరిగా లేకపోవడంతో పాటు బంగారం కనిపించలేదు. దీంతో మృతురాలి కుమారుడు అశోక్ వెంటనే సీఐ సార్ల రాజుకు ఫిర్యాదు చేశారు.

విభిన్న కోణాల్లో పోలీసుల విచారణ..

కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్, సీఐ సార్ల రాజుతో పాటు క్లూస్ టీం, డ్వాగ్‌స్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించారు. గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో టిఫిన్ చేసి ఇంటి నుంచి బయటకు వెళ్లిన విజయ.. దాదాపు 16 గంటల పాటు ఎక్కడ ఉంది.. శరీరంపై ఉన్న బంగారం కోసమే నిందితులు హత్యచేసి ఇంటి వద్ద పడేసి ఉంటారా..? లేక అప్పుడప్పుడు చిన్న మొత్తంలో నగదును తెలిసిన వాళ్లకు ఇస్తుండేదనే సమాచారం మేరకు ఆ కోణంలోనూ విచారణ జరుపుతున్నారు. తలపై బలమైన దెబ్బ కొట్టడంతోనే మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. కాలనీలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.